క్లుప్తంగా

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రంలో పత్తి అమ్ముకుని మద్దతు ధర పొందాలని సూచించారు. నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములుతో పాటు జూలకంటి సంజీవరెడ్డి, వాక వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



టై, బెల్టులు అందించిన సాధిక్ అలీ

కల్లూరు: కల్లూరు బాలికోన్నత పాఠశాల వద్దనున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకుడు ఎస్‌కే సాధిక్ అలీ రూ.10 వేల విలువైన టై, బెల్టులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసిరెడ్డి నాగపద్మ, ఉపాధ్యాయులు వరకా రామారావు, రమాదేవి, అనితకుమారి, ఫణిశంకర్‌రెడ్డి, వీరవేణిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం అండర్‌పాస్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. హైవేపై సర్వీస్ రోడ్డులో ఖమ్మం నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి మహిళను ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన జీజీబాయిని ఖమ్మం తరలించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కళాజాతా



పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న కళాబృందం

పెనుబల్లి: ఎయిడ్స్ వ్యాధి నివారణపై ఖమ్మం కళాజాతా బృందం పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోరూరి రాము జానపద కళాబృందం పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నివారణపై కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రత్నాకర్, లంకాసాగర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పాట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చిరుమర్రిలో టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

ముదిగొండ: మండలంలోని చిరుమర్రిలో పశు వైద్యసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వనం వారికిష్టాపురం డాక్టర్ రమేష్, పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 47పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 22 గేదెలకు సాధరణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీపీ వైరా ఈఓ డాక్టర్ కిషోర్, మన్యం రమేష్‌బాబు, సిబ్బంది అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై గవర్నర్ స్పందించాలి

ఏన్కూరు: ఏజెన్సీ మండలాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర గవర్నర్ పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు బానోత్ బాలాజీ, భూక్యా వీరభద్రం కోరారు. బుధవారం మండలంలో నిర్వహించిన గిరిజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసే విధంగా చూడాలని కోరారు. గిరిజనులకు విద్య, వైద్యం అందే విధంగా చూడాలని కోరారు. నాయకులు భూక్య లచ్చు నాయక్,బండ్ల చిన్నజోగయ్య, బానోత్ మధు, లావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువైద్యం.. దైవాధీనం !

- ఏళ్లుగా భర్తీకాని వైద్యుల పోస్టులు
- సిబ్బంది కొరత.. అరకొర మందులు
- పట్టించుకోని అధికారులు
- ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్న పశుపోషకులు

వైరారూరల్: మండల కేంద్రంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన వైద్య పోస్టులను భర్తీ చేస్తుందనే కోటి ఆశతో పాడి రైతులు ఎదురు చూస్తున్నారు.

మండలంలో ఖాళీల వివరాలిలా..

మండల కేంద్రమైన వైరాతో పాటు పాలడుగు గ్రామాల్లోని పశువైద్యశాలలో ప్రధాన వైద్యాధికారి పోస్టులు ఉండాల్సి ఉంది. రెండు పశువైద్యశాలలకు కలిపి 7 సబ్‌సెంటర్ ఉన్నాయి. వైరా పరిధిలో స్నానాల లక్ష్మీపురం, సోమవరం, సిరిపురం, గరికపాడు ఉండగా పాలడుగు ఆస్పత్రి పరిధిలో తాటిపూడి, రెబ్బవరం, గన్నవరం గ్రామాలు ఉన్నాయి. కానీ పాలడుగులో గత కొన్నేళ్ల నుంచి పూర్తిస్థాయి ప్రధాన వైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. వైరా పశువైద్యశాల వైద్యాధికారి ఇక్కడ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా రెబ్బవరం, గన్నవరం, సోమవరం, సిరిపురం, లక్ష్మీపురం, గరికపాడు, తాటిపూడి గ్రామాల్లోని సబ్‌సెంటర్లలో గత కొన్నేళ్లుగా పూర్తిస్థాయి అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మందుల కొరతతో ఇబ్బందులు..

పశువైద్యశాలల్లో సిబ్బందితో పాటు మందుల కొరత, ఆధునిక పరికరాలు లేకపోవడంతో మూగజీవాల పోషకులు ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. ప్రభుత్వం ఏళ్ల క్రితం నుంచి సబ్‌సెంటర్లకు ఏడాదికి రూ.9 వేలు, ప్రధాన ఆస్పత్రికి రూ.12 వేలు విలువ చేసే మందులు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కానీ మండలంలో సుమారు 12 వేలకు పైగా గేదెలు, 1,500 ఆవులు ఉండడంతో సంవత్సరానికి ఈ మందులు ఎటువైపుగా సరిపోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నిధులు మంజూరు సమయంలో మాత్రమే మందులు లభ్యమవుతాయని, దాని తర్వాత ప్రైవేట్‌షాపులే దిక్కుగా మారాయన్నారు.



శిథిలావస్థలో కేజీ సిరిపురం సబ్ సెంటర్

శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు..

మండలంలోని లక్ష్మీపురం, సిరిపురం, గన్నవరం, రెబ్బవరం వంటి గ్రామాల్లో పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాకాలం వస్తే వర్షాపు నీరు ఆస్పత్రిలో చేరడం పారిపాటిగా మారింది. అంతేకాకుండా పలు భవనాలు వర్షానికి కురుస్తుండడంతో మందులు భద్రపర్చుకునే పరిస్థితి లేకుండా పోయిందని సబ్‌సెంటర్ల నిర్వాహకులు వాపోతున్నారు. వీటి మరమ్మతుల కోసం పలుమార్లు ప్రతిపాదనలు చేసిన నిధులు కేటాయించడం లేదని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన శిథిలమైన వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మిస్తే కొంతమేర అయినా సమస్యలు తీరుతాయని పలువురు చెబుతున్నారు.



పాలడుగులో వైద్యుడు లేని పశువైద్య కేంద్రం

శిథిలావస్థలో భవనాలు..



కేజీ సిరిపురంలోని సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశువులు నిత్యం రోగాల బారీన, పాము కాటుకు గురువుతున్న సమయాన సబ్ సెంటర్లలో మందుల కొరత ఉంది. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్‌వారు ధరలు మండిస్తున్నారు.

– ఐనాల కనకరత్నం, కేజీ సిరిపురం

వైద్యుడిని నియమించాలి..



పాలడుగులో పశువైద్య కేంద్రం ఉన్నప్పటికీ వైద్యుడి పోస్టు, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది.. దాంతో ఇక్కడ నిత్యం ఇన్‌చార్జ్‌లే వైద్య సేవలు అందిస్తున్నారు. పూర్తి స్థాయి వైద్యుడిని నియమించకపోవడంతో ఇన్‌చార్జ్‌లు ఏ సమయంలో ఉంటారో తెలియక పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– కోసూరి రామకృష్ణ, పాలడుగు

ఓటు హక్కుపై అవగాహన



కుర్నవల్లి పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తల్లాడ: యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా నాయకులు రంజాన్ మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ పక్షాన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని ఎంపిక చేసినట్లు చెప్పారు. నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లాల్ సయ్యద్, తాళ్లూరు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీకాంత్, మురళీకృష్ణ, కుర్నవల్లి హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై నేడు సమావేశం

కల్లూరురూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై ఈ నెల 24న సాయంత్రం నాలుగు గంటలకు అధికారుల స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో కల్లూరు డివిజన్ పరిధిలోని వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, ఎంఈఓలు, తహసీల్దార్లు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఏన్కూరు: మండలంలో వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మండలంలోని మూలపోచారం, తిమ్మారావుపేట, ఏన్కూరు, కేజీబీవీ పాఠశాల, గురుకుల పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఫారాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాంచందర్, శ్రీదేవి, కోశాధికారి నాగేశ్వరరావు, పుల్లయ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమ పథకాలపై అవగాహన

వైరా: వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు ఆదూరి మణి ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా దివ్యాంగుల కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు అమలవుతున్న పథకాలు, ఉపాధిల గురించి వివరించారు. అనంతరం హ్యూమన్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు ఆదూరి ఆనంద్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవా సమితి అండగా ఉంటుందన్నారు. హ్యూమన్ రైట్స్ సొసైటీ లీగల్ అడ్వైజర్ ఐనసనూరి మహేంద్రనాథ్, మోదుగు వినోద్‌కుమార్, చిల్లిముంతల వెంకటేశ్వరరావు, కువ్వారపు విజయరాజు, రోమకుమారి, బుడిగి సునీత, అనీల్‌కుమార్, వెంకట్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టీకాలు వేయించాలి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మధిర: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఖమ్మంపాడు, దెందుకూరు, మధిర పట్టణంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణలో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది లంకా కొండయ్య, సుబ్బలక్ష్మి, సరోజిని, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ వైద్యసేవలను వైద్యురాలు వల్లూరి వసంత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేవీస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పోలీస్ అమర వీరుల దినోత్సవాలను పురస్కరించుకొని బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం బెటాలియన్ కమాండెంట్ పీజీపీసీ చటర్జీ మాట్లాడుతూ.. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరంలాగే సిబ్బంది, అధికారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బెటాలియన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యుత్‌శాఖ ఏడీఈగా బీమ్‌సింగ్



బీమ్‌సింగ్

పెనుబల్లి: పెనుబల్లి విద్యుత్ శాఖ ఏడీఈగా బి.బీమ్‌సింగ్ విధులు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న యాదగిరి ఖమ్మం టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పెనుబల్లి సెక్షన్ ఏఈ రవితేజతో పాటు కల్లూరు, పెనుబల్లి మండలాల విద్యుత్‌శాఖ సిబ్బంది బీమ్‌సింగ్‌కు స్వాగతం పలికారు.

కల్లూరు ఏఈగా వెంకట్..



ఏఈకి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కల్లూరు: కల్లూరు విద్యుత్‌శాఖ ఏఈగా పి.వెంకట్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గణేష్ ఎర్రుపాలెం మండలం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది ఏఈకి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్లు బత్తుల సత్యనారాయణ, ఎస్‌కే ఉస్మాన్‌బేగ్, లైన్‌మెన్‌లు చంద్రశేఖర్, శ్రీనివాస్.ఏఎల్‌ఎమ్‌లు మొరశీకృష్ణ, రవి, జమీల్, జాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా సుధాకర్‌రెడ్డి..



సుధాకర్‌రెడ్డి

కారేపల్లి: కారేపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈగా వేంరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం రూరల్ డివిజనల్ టెక్నికల్ ఏఈగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై కారేపల్లికి రాగా.. ఇక్కడ పనిచేసిన భూక్యా విజయ్ కుమార్ జిల్లా విద్యుత్ శాఖ స్టోర్‌కు బదిలీ అయ్యారు.

టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



భూషణ్‌రాజు



దామోదర్‌రావు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో బుధవారం టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక చేశారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భూషణ్ రాజు, అన్నవరపు దామోదర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, సంఘం బలోపేతానికి బాగా పని చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్, వెంగళరావు, సీతారాములు, హనుమంతరావు, శ్యాంసుందర్, ముత్తయ్య, సంధ్యారాణి, ఉమాదేవి పాల్గొన్నారు. మండల నూతన కమిటీ సభ్యులకు పలువురు సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్రవాహనాల వేలం

కారేపల్లి: కారేపల్లి క్రాస్‌రోడ్డులోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో పట్టుబడిన రెండు ద్విచక్రవాహనాలకు గురువారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రశాంతి, ఎస్ఐ వసంతలక్ష్మిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటాదారులు ధరావత్ పైకం చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

కొనసాగుతున్న ట్రెయినీల పర్యటన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న అధికారులు

కారేపల్లి: మండలంలోని ఆలియాతండాలో సివిల్ సర్వీసెస్ ట్రెయినీ అధికారుల పర్యటన మూడో రోజుకు చేరుకుంది. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీలో చిన్నారులతో ముచ్చటించి, వారికి అందిస్తున్న పోషక విలువలను తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతువేదికను సందర్శించి పంటల వివరాలు, వ్యవసాయదారులకు అందుతున్న రైతు భీమా, రైతు రుణమాఫీ, సబ్సిడీల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులోని సింగరేణి బొగ్గు గని సంస్థ నిర్వహిస్తున్న సోలార్ ప్లాంట్ ప్రాజెక్టును పరిశీలించి వివరాలను సేకరించారు. బృదంలో తేజస్విని ఐఈఎస్, అనితామీనా ఐఆర్ఎస్, వైభవ్‌మీనా ఐపీఎస్, అల్తామస్ ఘజీ ఐఏ అండ్ ఏఎస్, విపుల్ సింఘాల్ ఐఎఫ్ఎస్‌లు ఉండగా.. వీరి వెంట ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

లచ్చగూడెంలో రెండో రోజు..



మిర్చితోటను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు: మండలంలోని లచ్చగూడెంలో నిర్వహిస్తున్న ట్రెయినీ అధికారుల పర్యటన బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉపాధిహామీ పనులు రిజిస్టర్లు, సామాజిక తనిఖీ నివేదికలు, అంగన్‌వాడీ కేంద్రాలను, మిర్చితోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా సర్వీసెస్, సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు ఆల్తాఫ్ మహమ్మద్ షేక్, అంకిత్‌యాదవ్, ఇషాన్ గుప్తా శుభం, పంకజ్‌కుమార్ మీనా పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత

సత్తుపల్లిటౌన్: పట్టణంలో అన్ని వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ.. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన 43వ సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో కుక్కల బెడదపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. సమావేశంలో వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కమిషనర్ మందా రవిబాబు, కౌన్సిలర్లు సూరిబాబు, భవాని, ఎస్‌కె చాంద్‌పాషా, అనీష్, నాగలక్ష్మి, నాగుల్‌మీరా, దూదిపాల రాంబాబు, రాఘవేందర్, మహ్మద్ సలీమా ఖాతూన్, విజయనిర్మల, రమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

పంట నష్టపరిహారం అందించాలి

బోనకల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని రాపల్లి, ఆళ్లపాడు రైతులు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. సర్వేలో ఏఈఓ పక్షపాతంగా వ్యవహరించి.. సాగు చేయని వారికి.. చేసినవారికంటే ఎక్కువ పరిహారం అందేలా చేసిందని ఫిర్యాదులో పాల్గొన్నారు. విచారణ జరిపి అర్హులకు పరిహారం అదేలా చూడాలని, అవకతవకలకు పాల్పడిన ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరగా.. కలెక్టర్ స్పందించి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు లింగయ్య, తోటకూర వెంకటేశ్వరావు, ఉపేంద్ర, నరసింహారావు, బాబు.జానీ, మరీదు వెంకటేశ్వర్లు, మందా కృష్ణయ్య, ఐతంరాజు, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆళ్లపాడు రైతులు

వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేయాలి

బోనకల్: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను తప్పుడు సర్వే చేసి అర్హులైన రైతులను నష్టపరిచిన ఏఓ, ఏఈఓలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదివరకే నష్టపోయిన పంటలను సీపీఐ బృందం పరిశీలించిందని, పంటల సర్వేలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆనంద్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రోషన్‌కుమార్, మండల సహాయ కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

ముదిగొండ: ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వకుండా, రుణమాఫీ చేయకుండా, రైతులను విస్మరిస్తోందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ ఆరోపించారు. ముదిగొండలో మచ్చా వీరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర



ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబ సభ్యులు

సత్తుపల్లి: తిరుమల శ్రీవారిని నూతన వధూవరులు సండ్ర భార్గవ్, సాయిచిద్వితలతో కలిసి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మహాలక్ష్మి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తి శ్రద్ధలతో శ్రీలక్ష్మీ గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు బుధవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అదే విధంగా శ్రీలక్ష్మీ గణపతి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి శ్రీ అయ్యప్పస్వామిలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 45మంది భక్తులు అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, పోలిశెట్టి శివకుమార్, దోసపాటి అమరలింగేశ్వరరావు, సురేష్, ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



దాత తల్లిదండ్రులను సన్మానిస్తున్న కమిటీ బాధ్యులు

తల్లాడ: మండలంలోని కేశ్వాపురంలో సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ఎన్ఆర్ఐ చావా అమర్ – స్వాతి దంపతులు రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. ఆలయ ప్రధాన మండపం చుట్టూ గ్రిల్స్ నిర్మాణానికి అమర్ తల్లిదండ్రుల ద్వారా విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈసందర్భంగా అమర్ తల్లిదండ్రులు చావా నరసింహారావు – జయమ్మ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టా రమాకాంత్, మాజీ సర్పంచ్ అలేఖ్య అశోక్, వనిగండ్ల వెంకటేశ్వర్‌రావు, మన్నేపల్లి రామారావు, చావా నాగేశ్వర్‌రావు, కట్టా కృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాస రాజన్, సాదం రమేష్, శ్రీనివాసరావు, విజయలక్ష్మీ, గోవర్ధన పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు రామిరెడ్డి మృతి

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు అయిలూరి రామిరెడ్డి(85) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.